క్లుప్తంగా

వైభవంగా యమ ధర్మరాజు పూజా మహోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఆది శేష నిలయంలో పదిహేను రోజులుగా జరుగుతున్న షోడశ రాత్రి పితృదేవతా పూజా మహోత్సవాల్లో భాగంగా సమవర్తి యమ ధర్మరాజు పూజా కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. యమ హవనాన్ని అక్షయ పాత్ర ట్రస్ట్ సభ్యులు నూకల నాగేంద్ర వరప్రసాద్, ఏసు కుమారి దంపతులు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆది శేష నిలయం ప్రాంగణంలో వందలాది మంది భక్తులు సామూహిక దీపారాధన చేశారు. శ్రీ కాలభైరవ శాంతి హోమాన్ని నిరంతరాయంగా జ్వలింపచేస్తూ ఈ పూజామహోత్సవాలు నిర్వహిస్తున్నారు. సమవర్తి యమధర్మరాజు షోడశ రాత్రి పితృ దేవతల విశిష్టత గురించి శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు, అక్షయ పాత్ర ట్రస్ట్ చైర్మన్ పోతురాజు రామకృష్ణారావు భక్తులకు వివరించారు. గోశాల, అక్షయ పాత్ర సేవకులు గొవ్వాల అచ్యుత రామయ్య, తూము దొరబాబు, లింగోలు విస్సు భక్తులకు సేవలు అందించారు.

జగనన్నకు చెబుదాంకు 53 ఫిర్యాదులు

ఐ.పోలవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో డి.రాంబాబు తెలిపారు. మండలంలోని 14 గ్రామాల్లో ఉన్న వివిధ రకాల సమస్యలను అధికారులకు విన్నవించుకొన్నారు. ఫిర్యాదులను నేరుగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్‌కు, ఆర్డీవో వసంతకుమార్‌కు అందజేశారు. వీటిని సత్వర పరిష్కారం అయ్యేలా ఆయా శాఖల అధికారులకు బదలాయించారు.

తపాలా బిళ్లల ప్రదర్శన

అమలాపురం టౌన్: తపాలా వారోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా స్థానిక వెత్సావారి అగ్రహారంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తపాలా బిళ్లల ప్రదర్శన నిర్వహించారు. అమలాపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటైంది. వాకర్స్ క్లబ్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రదర్శన నిర్వహించారు. వివిధ దేశాల తపాలా బిళ్లలను ప్రదర్శనలో ఉంచారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యల్రమిల్లి సత్యనారాయణమూర్తి, పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

ముమ్మిడివరం: ఈ నెల 15న కాకినాడ సూర్య కళామందిర్‌లో నిర్వహించే రాష్ట్ర దళిత సదస్సులో అధిక సంఖ్యలో దళితులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా సభ్యుడు జి.దుర్గాప్రసాద్ కోరారు. సీపీఎం నాయకులు పాము బాలయ్య, ఐ.మంగాదేవి, బీ.సీతతో కలిసి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను స్థానికంగా పంపిణీ చేశారు.

19న అంగన్‌వాడీ యూనియన్ మహాసభలు

ముమ్మిడివరం: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర సభ్యురాలు కె..కృష్ణవేణి పిలుపునిచ్చారు. ఈ నెల 19న మండపేట బాలు కన్వెన్షన్ హాలులో జరిగే మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షురాలు బేబి రాణి పాల్గొంటారన్నారు.

సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ షెడ్ పరిశీలన

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ని కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ కోఆర్డినేటర్ రషీద్ శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన కొమరగిరిపట్నం సచివాలయంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రషీద్ హాజరయ్యారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, సేకరించిన చెత్తనే సంపద సృష్టి కేంద్రాలకు తరలించడం తదితర విషయాలపై సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలను పరిశీలించారు.

బీమా వినియోగించుకోవాలి

యానాం: ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనలో భాగంగా అమలు జరుగుతున్న చీఫ్ మినిస్టర్ ఇన్సూరెన్స్ అసిస్టెన్స్ స్కీమ్‌ను ఎరుపు రంగు రేషన్‌కార్డుదారులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం పుదుచ్చేరి, యానాం , మాహే, కారైకల్ రీజియన్‌లలో సెప్టెంబర్ 25 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ప్రమాదంలో మృతిచెందితే రూ.2లక్షలు, రెండు కళ్లు కోల్పోయినా, చేతులు, ఒక కన్ను, కాలు,చేయి కోల్పోయినవారికి రూ.2లక్షలు, చూపు, చేయి, కాలు కోల్పోతే రూ.లక్ష చొప్పున సహాయం అందుతుందన్నారు. వివరాలకు సాంఘిక సంక్షేమశాఖను సంప్రదించాలన్నారు.

డిప్యూటీ సర్వేయర్‌గా పాపారావు

యానాం: యానాం సర్వే విభాగం డిప్యూటీ సర్వేయర్‌గా బీవీ పాపారావును నియమిస్తూ శుక్రవారం డైరెక్టరేట్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ పి.సెంథిల్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం యానాం సర్వే విభాగంలో ఫీల్డ్ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న పాపారావుకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ సిఫారసు మేరకు డిప్యూటీ సర్వేయర్ గా అడ్‌హక్ బేసిస్‌పై నియమించారు.

ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం

- ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



జగనన్న ఆరోగ్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాళ్లరేవు: ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామగ్రామాన విశేష స్పందన వస్తోంది. సొంత గ్రామంలోనే రూపాయి ఖర్చులేకుండా ఆధునిక సౌకర్యాలతో వైద్య సేవలు అందిస్తుండడంతో ఈ పథకానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే సమయంలో ప్రారంభించిన ఈ పథకం అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం గత నెల 30వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించింది. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందితోపాటు మండల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని సేవలందిస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓలు రెండు బృందాలుగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా జరిపిస్తున్నారు.

నెలరోజులపాటు ఇంటింటి సర్వే

పథకాన్ని ప్రారంభించే ముందే గ్రామస్థాయిలో వలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. బీపీ, సుగర్ తదితర దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించారు. సీజనల్ వ్యాధులైన జ్వరం, దగ్గు, వివిధ రకాల నొప్పులతో బాధపడే వారిని గుర్తించి వారికి ఆయా గ్రామాల్లో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు కూడా చేయిస్తున్నారు.

ఏడు రకాల వైద్య పరీక్షలు

సాధారణంగా చిన్నపాటి నలతకే రకరకాల వైద్య పరీక్షలు చేయించి జనం జేబులకు చిల్లులు పెడుతుంటారు. ఆయా పరీక్షలు చేయించుకోలేక నిరుపేదలు అనేక ఇబ్బందులు పడుతుంటారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో అనేకమంది అవసరమైన పరీక్షలు చేయించుకోకపోవడంతో వ్యాధులు ముదిరి ప్రాణాపాయ పరిస్థితి తెచ్చుకుంటారు. ఈ పరిస్థితిని గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్కరూ వైద్యం అందక ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదనే లక్ష్యంతో ప్రతీ గ్రామంలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో వైద్య సేవలందించి ప్రాణాలు నిలుపుతున్నారు. ఐదుగురు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఏడురకాల టెస్ట్‌లను ఉచితంగా చేస్తున్నారు. ప్రతీ పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది.

పౌష్టికాహారంపై అవగాహన

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారంపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించడంతోపాటు రక్తహీనతను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

ఉచితంగా మందులు ఇచ్చారు



నాకు కొన్ని రోజులుగా నరాలు లాగేస్తున్నాయి. కాకినాడ వెళ్లి చూపించుకోవాలంటే చాలా ఖర్చవుతుందని ఆలోచిస్తున్నా. ఈ సమయంలో గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో చూపించుకున్నాను. అన్ని రకాలుగా పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు నాకు చాలా వరకు తగ్గింది.

– చిట్టూరి నూకరత్నం, చొల్లంగి

పేదలకు ఉపయోగపడే పథకం



ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఎంతోమంది నిరుపేదలు అనేక ఇబ్బందులు పడుతుంటారు. ఈ సమయంలో ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం పేదలపాలిట వరంగా మారింది. ఉన్న ఊరిలోనే అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రూపాయి కూడా తీసుకోకుండా మందులు ఇస్తున్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– చింతపల్లి గణపతిరావు, రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్

ప్రజల నుంచి విశేష స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. గ్రామాల్లో నిర్వహించే శిబిరాలకు ప్రజలు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. బీపీ, సుగర్ వంటి పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్నారు. దీంతో దీర్ఘకాల వ్యాధుల నుంచి స్వాంతన పొందుతున్నారు.

– ఈశ్వర్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు, తాళ్లరేవు

కొండపల్లి బొమ్మల తయారీపై శిక్షణ


నవోదయలో కొండపల్లి బొమ్మల ప్రదర్శన

యానాం: విద్యార్థుల్లో కళల పట్ల ఆసక్తి కలుగజేయడంతో పాటు వాటిని భవిష్యత్ తరానికి అందజేసే విధంగా కాలక్రమేణా కనుమరుగవుతున్న కొండపల్లి కొయ్యబొమ్మల తయారీ విధానంపై స్థానిక నవోదయ విద్యాలయలో విద్యార్థులకు 10 రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ప్రారంభించారు. ఆర్ట్ ఇన్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 2023–24 విద్యాసంవత్సరంలో 2డి, 3డి పెయింటింగ్‌లతో పాటు లక్కబొమ్మల తయారీపై శిక్షణ ఇస్తారు. ప్రసిద్ధ లక్కబొమ్మల తయారీదారు, రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత తామరపల్లి వరహాలు నేతృత్వంలో విద్యార్థులకు మెళుకువలు నేర్పుతున్నారు.

15 నుంచి ఆర్‌బీకేల్లో ఈ పంట జాబితా

అమలాపురం రూరల్: ఈ పంట నమోదు చేసిన జాబితా గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రాల్లో 15 తేదీ నుంచి 19వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి రైతుల పేర్లను చదివి వినిపిస్తారని ఎంపీపీ కూడిపూడి భాగ్యలక్ష్మి అన్నారు. మండలం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ సలాది శ్రీనివాస చక్రవర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి కడలి ధర్మప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రైతు 14వ తేదీన లోపు ఈపంట నమోదుచేయించుకోవాలని తెలిపారు. 25 న ఈ పంట తుది జాబితా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

ఉత్సాహంగా నా భూమి నా దేశం


అమృత్ కలశ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యూల్‌సాగర్

తాళ్లరేవు: ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండల స్థాయి నా భూమి నా దేశం కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టిని మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కలశంలో వేశారు. ఈ మట్టి ఢిల్లీకి పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు వారు తెచ్చిన మట్టి కలశాలతో ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, ఎంపీటీసీ సభ్యుడు రేకాడి నరసింహమూర్తి, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, ఎంఈఓలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ, ఆయా పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీదేవీ నవరాత్ర మహోత్సవాలు

యానాం: యానాంలో కొలువైన శ్రీలలితాదేవి అమ్మవారి ఆలయం 49వ వార్షికోత్సవంలో భాగంగా శ్రీదేవీనవరాత్ర మహోత్సవాలను ఆదివారం నుంచి 24వ తేదీ వరకు ఆర్షసేవాసమితి వ్యవస్థాపకులు, టీటీడీ వేద పండితులు తాతపూడి రామకృష్ణావధానుల పర్యవేక్షణలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు శుక్రవారం శ్రీలలితాభక్తమండలి ప్రకటనలో తెలిపింది. దీనిలోభాగంగా ఆదివారం ఉదయం కలశ స్థాపన జరుగుతుందన్నారు. 21న లక్ష కుంకుమార్చన ఉంటుందన్నారు.

విద్యార్థుల ఘర్షణపై రెండు కేసులు

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలకు చెందిన కొంత మంది విద్యార్థుల ఘర్షణపై రెండు కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. ఈ రెండు కేసుల్లో ఇప్పటి వరకూ మొత్తం 17 మంది విద్యార్థులను గుర్తించామని చెప్పారు. ఈ 17 మంది నిందితులను పోలీసు స్టేషన్‌కు పిలిచి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ బృందం ఈ రెండు కేసులను దర్యాప్తు చేస్తోందని డీఎస్పీ చెప్పారు.

ఉద్యోగులకు బయెమెట్రిక్ అటెండెన్స్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధశాఖల్లో ఉద్యోగులకు, అధికారులకు అటెండెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్(ఎఇబిఎఎస్)అమలుకు శుక్రవారం ప్రధాన సెక్రటరీయేట్ పరిధిలోని అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ విభాగం కార్యదర్శి ఎస్ ఉదయకుమార్ ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వశాఖలు, డైరెక్టరేట్స్ పరిధిలోని ఉద్యోగుల హాజరును పర్యవేక్షించేందుకు ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

తేనె కోసం వెళ్లగా నిప్పంటుకుని గాయాలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ బొడ్డువానిలంక గ్రామానికి చెందిన విత్తనాల రాంబాబు తేనేటీగల కోసం ఈత చెట్టుపైకి వెళ్లి ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12వ తేదీన ఈతచెట్టుపై ఉన్న తేనేటీగల నుంచి తేనె తీసే ప్రయత్నంలో మంట పెట్టేందుకు రాంబాబు ఈత చెట్టు ఎక్కాడు. చెట్టుపై నిప్పుపెట్టే క్రమంలో నిప్పురవ్వలు కింద పడి అక్కడ ఉన్న కమ్మలు అంటుకుని చెట్టుకు మంటలు పైకి వ్యాపించడంతో 80 శాతంపైగా తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. రాంబాబు సోదరుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పైపులైన్ గ్యాస్ పంపిణీకి అనుమతి

యానాం: పైపులైను ద్వారా ఇంటింటికీ కుకింగ్ గ్యాస్ పంపిణీకి నాలుగు కంపెనీలకు అనుమతిచ్చినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ శుక్రవారం ప్రకటనలో తెలిపింది. పుదుచ్చేరి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పాలసీ–2023 ప్రకారం ఈ కార్యక్రమం అమలవుతుందన్నారు. యానాంకు హెచ్‌సీజీ, పుదుచ్చేరికి ఈస్ట్ కోస్ట్ నేచురల్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, కారైకల్ ప్రాంతానికి టోరెంట్‌గ్యాస్, మాహేకు ఇండియన్ ఆయిల్ అదాని గ్యాస్ కంపెనీకి పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు అనుమతిచ్చినట్లు తెలిపారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

గూడాల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం


గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న శ్రీకాంత్

అల్లవరం: గాంధీజీ కలల కన్న సుపరిపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు పినిపే శ్రీకాంత్ అన్నారు. సర్పంచ్ దాకారపు చిరంజీవి రావు, నోడల్ అధికారి, ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గూడాల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో వివిధ పథకాల ద్వారా అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామ సుపరిపాలనే లక్ష్యంగా గ్రామ సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్నారని శ్రీకాంత్ తెలిపారు. ఏ రాష్ట్రంలో అమలుకానన్ని సంక్షేమ పథకాలు ఏపీలో అమలవుతున్నాయన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, తుని పార్టీ పరిశీలకులు, చెల్లుబోయిన శ్రీను, ఎస్సీ సెల్ మాజీ కార్యదర్శి ఉండ్రు వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పరమట శ్రీను, పార్టీ నాయకులు సంతోష్, కలగట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు బీపీ మెషీన్ల పంపిణీ


బీపీ మెషీన్లు అందించిన ఎంపీ అనురాధతో డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది

అల్లవరం: గోడిలంక పీహెచ్‌సీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలకు ఎంపీ చింతా అనురాధ మొగళ్లమూరు ఎంపీ కార్యాలయంలో శుక్రవారం 14 బీపీ మెషీన్లు పంపిణీ చేశారు. వీటిని తన సొంత ఖర్చుతో ఆమె సమకూర్చారు. తొలుత పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎంపీ అనురాధకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు బర్రె సీతారత్నం, రాకాపు విజయలక్ష్మి, టీపీసీ మెంబర్ కుడుపూడి శ్రీను పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' దేశానికే ఆదర్శం


శిబిరాన్ని ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు

ముమ్మిడివరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివ శంకరరావు పేర్కొన్నారు. మండలంలో చినకొత్తలంక సచివాలయ పరిధిలో ఎంపీపీ స్కూలు ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయన్నారు. 562 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. చినకొత్తలంక, మర్లపాలెం గ్రామ సర్పంచ్‌లు పాత్తూరి ఉమారాణి, విత్తనాల నాగ బ్రహ్మేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కొత్తలంక సొసైటీ అధ్యక్షుడు పీటీవీ వర్మ, ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ విజయశ్రీ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


కేశనకుర్రుపాలెం జెడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో వివరాలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజల ఆరోగ్య పరిస్థితులు చక్కదిద్దటమే లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం కేశనకుర్రుపాలెం జెడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహణ తీరును ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్యులు డి.శివగాయత్రి, టి.ఆదిత్య పవన్, ఎం.రామానుజరావు, వినయ్‌కుమార్, కేజీయాలు 718 మందికి వివిధ రకాల పరీక్షలు చేశారు. లేబ్ టెస్టులు 342, కంటి పరీక్షలు 117 మందికి నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియంజ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం

కేశనకుర్రు పంచాయితీ పరిధి అక్కపువాని చెరువు వద్ద సీఎస్ఆర్, ఓఎన్‌జీసీ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ప్రారంభించారు.

నిరుపేదలకు సంజీవని

తాళ్లరేవు: దీర్ఘకాలిక రోగాలు, ఇతర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంజీవని వంటిదని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. శుక్రవారం ఇంజరం–2 సచివాలయ పరిధిలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. గ్రామ సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి శివన్నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 300 మందికిపైగా బీపీ, సుగర్, తదితర పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు.


పేరూరులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దోలామణి, ఎంపీపీ భాగ్యలక్ష్మి


ఇంజరం-2లో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ, నాయకులు

గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులు శ్యామల, సురేష్‌కుమార్‌తోపాటు జనరల్ మెడిసన్, పిల్లల వైద్యుడు, గైనకాలజిస్ట్ బృందం రోగులను పరీక్షించి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ ముద్దన ప్రసాద్, తహసీల్దార్ ఎస్.పోతురాజు రోగులకు ఉచితంగా మందులు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, గ్రామ ఉపసర్పంచ్ కోరుకొండ అప్పారావు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ పెయ్యల కొండబాబు, నాయకులు చేదూరి అరవింద్, కోరుకొండ చంటి, బీర సురేష్ పాల్గొన్నారు.

కోడూరుపాడులో..

అల్లవరం: కోడూరుపాడు సచివాలయంలో వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి హాజరై లబ్ధిదారులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. వైద్యాధికారులు సుమ, స్పందన, నీలోఫర్‌లు 502 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కంటి వైద్య నిపుణులు అబ్బాస్ ఆధ్వర్యంలో 194 మందికి పరీక్షలు నిర్వహించారు. గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంపీటీసీ సభ్యుడు గుబ్బల రంగనాథస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ పాటి శ్రీరామ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జల్లి శ్రీను, ఎంపీడీఓ కృష్ణ మోహన్, డీటీ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి చిక్కం శ్రీను పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు వరమని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగెటి దోలామణి అన్నారు. పేరూరు సచివాలయం – 2లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ దాసరి అరుణతో కలిసి ఆమె శుక్రవారం ప్రారంభించారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాఆహారం స్టాల్స్ సందర్శించారు. ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బురామ్, దొంగ ఆంజనేయులు, వాసంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో సచివాలయం–1 పరిధిలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 403 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 139 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 110 మందికి కళ్ల జోళ్లు ఉచితంగా అందిస్తామని వైద్యులు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

కాట్రేనికోన: స్థానిక జెడ్పీహెచ్ పాఠశాల వద్ద సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ వెంకటాచలం, తహసీల్దారు సత్యనారాయణ పాల్గొన్నారు.